



# పైశాచిక పరిహాసం

ఎండ తీక్ష్ణత తగ్గింది. అబ్బాయిలూ, అమ్మాయిలూ షికారుకు బయలుదేరే వేళ అయింది.

పేవ్‌మెంట్ మీద కూర్చున్నాడు సురేందర్. ఒక జాజిచెక్క పెట్టె, రెండు పాలిష్ డబ్బాలు, ఒక బ్రష్షు, పాత గుడ్డపేలికలు అతని ముందు ఉన్నాయి.

షికారు వేళ్లేవాళ్లను చూచి, సురేందర్ జారిపోతున్న నిక్కర్ సవరించుకుని మునికాళ్లమీద కూర్చున్నాడు. అతని పెదిమెల మీద చిరునవ్వు తొంగి చూస్తున్నది.

మధ్యాహ్నంనుండి మండుటెండలో కూర్చున్నా ఈవేళ బూట్ పాలిష్‌కు గిరాకీ తగలలేదు. ఈవేళ సెలవురోజు కాబోలు. సాయంకాలం అయింది కనక ఇప్పుడైనా తప్పకుండా తనకు చేతినిండా పని తగులుతుంది. జేబు నిండుతుంది. జేబులో డబ్బులు గలగలా మోగించ

క్కుంటూ ఇరానీ హోటల్‌కి వెళ్ళి డబుల్ రోటీ కొనుక్కోవాలి. వచ్చి ఉల్లిపాయ ముక్కలు, పండు టొమాటోముక్కలు —అన్నీ కలిపి పొట్లం కట్టించుకోవాలి. ఆర్. టి. సి. బస్సు ఎక్కి ఒస్సీ చేరుకోవాలి. కండక్టర్ మంచివాడైతే తనకు టిక్కెట్టు కత్తిరించడు. డబ్బులు తీసుకోడు. ఆ డబ్బులు పెడితే అరటిపండ్లు మూడొస్తాయి. అమ్మా, తనూ కలిసి కమ్మగా తినచ్చు. నాన్న తప్పతాగి పడిఉంటాడు. బుజం తట్టి, ఊపి, పిలిచినా పలకడు. ఒకవేళ పలికినా, కస్సుమని తాచుపాములా లేస్తాడేతప్ప తనతో పాటు తినడు.

లేత బుగ్గల మీద ఎర్రని ఎండ పొడకు తోడుగా మేనసులోని మధురోహతో సురేందర్ ముఖం ముద్ద మందారపువ్వులా వికసించింది. తైల సంస్కారం లేని ముంగురులు పిల్లగాలికి రెపరెపలాడుతూ అతని నొసట నాట్యం చేస్తున్నాయి.

నోరు సగపడ తెరిచి కళ్ళు పెద్దవిచేసి రోడ్డుమీద నడుస్తున్న బూట్లను చూస్తున్నాడు సురేందర్.

రెండు నల్లబూట్లు సురేందర్ ముందుకు వచ్చాయి. ఒక బూటు జాజిచెక్కల పెట్టెమీద నిలబడింది. రెండవ బూటు పేవ్‌మెంట్ గచ్చు మీద ఆని ఉంది. ఆ బూట్లపైన టెరిలిన్ పాంటు టైటుగా నిలబడి ఉంది. పాంటు పైన వీపుమీద బనియన్ కనిపిస్తూ, పాముకూసం లాంటి పలచని చొక్కా రెపరెప లాడుతూంది.

ఆ వచ్చిన వ్యక్తి ఆ పక్కనే కాలేజీలో చదువుకుంటూ, కాలేజీని ఆనుకుని ఉన్న హాస్టల్‌లో ఉంటున్న కుర్రాడు కుమార్. సిగరెట్టు లీలగా పెదిమల మధ్య బిగించి నిలబడ్డాడు.

రోడ్డుమీద నుంచి పేవ్‌మెంట్ వైపు చూస్తే టెరిలిన్ పాంటు రెండు గొట్టాల మధ్య సురేందర్ తలకాయ బిగించి ఉన్నట్టుగా కనిపిస్తున్నది. కాని, సురేందర్ ఏ ఇబ్బందీ లేకుండా జోరుగా బూటును పాలిష్ చేస్తున్నాడు.

సురేందర్ దోస్తు సుధాకర్ చిక్కీలు అమ్ముకుంటూ ఆ రోడ్డువెంట వచ్చాడు.

సురేందర్‌ను చూచి, 'గిరాకీ మంచిగా నడుస్తూందే!' అని చేటంత మొహం చేసుకుని చకచకా సాగిపోయాడు సుధాకర్, "చికీ, చికీ" అని అరుచుకుంటూ.

బూట్ పాలిష్ చెయ్యడం పూర్తయింది. బూట్లు రెండూ క్రేప్ సిల్కులాగా నిగనిగలాడుతున్నాయి.

కుమార్ పిరుదులు సవరించుకుంటూ తన పాంటు హిప్ పాకెట్టులోకి చెయ్యి పోనిచ్చాడు.

ఖాళీ! హిప్ పాకెట్టు ఖాళీగా ఉంది!

"అరె! నా పర్సు!" అంటూ పది సెకండ్లు గాభరాపడ్డాడు కుమార్.

అంత గాభరాలో కూడా అతనికి వెంటనే ఆలోచన తట్టింది కాబోలు, క్రింది పెదవి కొరికాడు.

"రాస్కెల్! నా పాకెట్టు కొట్టేసి నీ దోస్తుకు ఇచ్చి పంపేస్తావురా! చూడు, నిన్నేం చేస్తానో — దొంగ రాస్కెల్!" అని ఉగ్రుడై కుమార్ పాంటు సర్దుకుని వంగాడు, బూటు విప్పడానికి.

సురేందర్ వేటగాడి ముందు నిలబడ్డ లేడిపిల్లలాగా కళ్ళు గిరగిరా తిప్పాడు. లేచి నిలబడ్డాడు.

"సైర్! నీ కాలి మొక్కి చెబుతుండా. నే పాకెట్‌మార్‌ని కాను. నా దోస్తూ మంచోడు" అని ప్రాధేయపడ్డాడు సురేందర్.

**కొందరికి పరిహాసం వేడుక అయితే మరికొందరికి జీవితమే పైశాచిక పరిహాసం. విధి విపరీతంగా ఉంటుందనే మీమాంసలో పడి. జీవితంతో రాజీపడడానికి తగిన వేదాంతం అందరికీ పట్టుబడదు కూడా.**

సురేందర్ మాట పూర్తి అయ్యేలోపల కుమార్ బూటు విప్పాడు. చెయ్యి చాచి సరిగ్గా సురేందర్ బుగ్గమీదకు బూటుతో గురి చూస్తున్నాడు కుమార్.

సురేందర్ ఛట్టున వంగి కుమార్ రెండుకాళ్ల సందునుండి దూరి పరుగెత్తాడు.

రోడ్డు దాటాడు. అక్కడే ఉంది గరల్స్ హాస్టల్.

సురేందర్ బాణంలా దూసుకువచ్చి 25 వ నంబరు గదిలో జొరబడ్డాడు.

సైఖాలజీ పుస్తకం ఛట్టున మూసేసింది ఆ గదిలో ఉండే రాధ. తన రూమ్మేట్ విమల వంక చూచింది.

చేతిలో పెన్ను క్రింద పెట్టి వింతగా చూస్తున్నది విమల.

సురేందర్ రొప్పుతూ రోజుతూ నిలబడ్డాడు. కళ్లలో తడి ఎక్కువగా ఉంది. చెంపలనుండి చెమటలు ధారలుగా కారుతున్నాయి. రాగిరంగు ముంగురులు నొసటికి అంటుకుపోయినాయి.

సురేందర్ గజగజా వణికిపోతున్నాడు. చెమట బిందువులు టపటపా నేలమీద రాలుతున్నాయి.

"నీ కాలు మొక్కుతా, దొరసాన్లూ! నే చోర్‌ను కాను. ఊకే కొడుతుంటే ఉరుక్కొచ్చా" అని గద్గదస్వరంతో చెప్పాడు సురేందర్. జాలిగా, ఆశగా రాధవంక, విమల వంక చూస్తూ నిలబడ్డాడు.

రాధకు, విమలకు ఏమీ పాలుపోక ఒకరి వంక ఒకరు చూచుకుంటూ మధ్య మధ్య సురేందర్ వైపు దృష్టి మరల్చుతున్నారు.

"సత్తెం, దొరసాన్లూ" అని సురేందర్ నడుము కుంచుకుని నిలబడ్డాడు.

రాధ సురేందర్ వంక మరొక్కమారు చూచి గట్టిగా శ్వాస విడిచింది.

"సరే! మన రూములో వీడిని కొంచెంసేపు ఉండనిద్దాం" అని విమలతో అన్నది రాధ.

భయంతో కళ్ళు బైర్లు కమ్ముకుపోయిన సురేందర్‌కు ఆ రూములో ఇంకా వెలుతురున్నది, సొంతం చీకటి పడలేదని అప్పుడు తెలిసింది.

ఆదరణ వలన కలిగిన అభిమానంతో ఒక్కసారి బిగ్గరగా ఏడ్చి కళ్లనీళ్లన్నీ కార్చేశాడు సురేందర్. మాసిపోయిన చొక్కాతో మొహం తుడుచుకున్నాడు.

పాలిష్ మరకలు దుమ్మూ, ధూళీ అన్నీ కలగాపులగంగా అతని మొహానికి అంటుకున్నాయి. రంగు వెలిసిపోయి బూజుపట్టిన బొమ్మలా నించుని ఉన్నాడు సురేందర్.

ఇంతలోపల టెరిలిన్ టైట్ పాంట్ కుమార్, ఇద్దరు పోలీసు కాన్‌స్టేబుల్స్‌ను వెంటబెట్టుకుని గరల్స్ హాస్టల్ వార్డెన్ దగ్గరకు వచ్చాడు.

వార్డెన్‌ను వెంటబెట్టుకుని ఒక్కొక్క రూమే వెదకటం మొదలు పెట్టారు పోలీసులు.

## పి. శారద

పోలీసులు రెండు రూములు సోదా చేసే లోపల ఆ అమ్మాయి నోటి నుండి ఈ అమ్మాయికి అంచెల మీద 25 వ నంబరు రూములోకి ఈ వార్త చేరింది.

రాధ, విమల ఆలోచనలో పడ్డారు.

"కప్ బోర్డులో పెట్టి దాచేద్దామా వీడిని?" అన్నది విమల.

రాధ ఒకటికి రెండు సార్లు సురేందర్ వంక చూసింది.

"వద్దు, విమలా! వాడితోపాటు మనల్ని కూడా దొంగల క్రింద జమ కడతారు. వద్దు" అని బరువుగా మాట్లాడుతూ సురేందర్ వైపు అడుగులు వేసింది రాధ.


ఒక అరగంటసేపు అమ్మ పక్కలో దూరి పడుకున్న పసికూనలా నిశ్చింతగా కూర్చున్న సురేందర్ తన కథ మళ్లీ మొదటికి వచ్చిం దనుకున్నాడు.

రాధ తనను పోలీసులకు పట్టిస్తుంది అనుకుని ముందుకు వస్తున్న రాధను చూచి బిక్కమొహం వేసుకుని చూస్తూ లేచి నిలబడ్డాడు సురేందర్.

అంత చిన్న గదిలో నించున్న చోటు నుండి వెనక్కు రెండు అడుగులు వేశాడు సురేందర్. తలకాయ గోడకు గట్టిగా కొట్టుకున్నది. ఆగిపోయాడు.

నిలబడ్డ సురేందర్ నీళ్లు తిరిగిన కళ్లలో రాధ ప్రతిబింబం కనిపిస్తున్నది.

సురేందర్ చెయ్యి పుచ్చుకున్నది రాధ. బాత్‌రూమ్‌లోకి లాక్కు వెళ్లి సోపుతో




రాత్రి ఎనిమిది దాటిన తరవాత గోడ దూకుతున్న పెద్దమనిషిని ఆ రోడ్డున పోతున్న ఆసామీ పట్టుకుని—

"చూస్తే పెద్దమనిషిలా ఉన్నావు. ఈ దొంగబుద్ధి ఏమిటి?" అని అడిగాడు.

ఆ పెద్దమనిషి బదులు చెప్పక పోవడంతో ఆ ఇంటి యజమానిని పిలవసాగాడు — "ఏమండోయ్, ఇంటి యజమాని గారూ!" అని.

"అలా కాదు. ఖచ్చితంగా ఎనిమిదింటికే గేటు మూసేసి దేవుడు వచ్చినా తియ్యని ఇంటావిడగారూ! అని పిలవండి" అని సలహా ఇచ్చాడు ఆ దొంగ పెద్దమనిషి.

"అన్ని ఆచూకీలు తెలుసుకునే దొంగతనానికి దిగావన్న మాట. అరి దౌర్భాగ్యుడా! ఇంతకీ నువ్వెవరివి?" అనడిగాడు అతన్ని పట్టుకున్న ఆసామీ.

"అవును. నేను నిజంగా దౌర్భాగ్యుణ్ణే. నేనే ఆ ఇంటి యజమానిని!"

# ఉత్తరాలు

(2 వ పేజీ తరువాయి)

కావు! నాయక వినాయకులకు వాడిబాణాలు. పాఠకులకు పాఠాలు. 'ప్రమదావనం'లో మాలతీ చందూర్ గారి కార్టూను జవాబులులు చాలా 'ఏస్ప్'గా ఉన్నాయి.

—చిర్రావూరి వెంకట్రావు, లలిత (నిడదవోలు)

* * *

జమున ముఖచిత్రం ప్రభకు చాలా వన్నె చేకూర్చింది. మూమారు మూడు నెలల పాటు మీరు మాకు అందించిన 'వాస్తవ గాథలు' శీర్షిక చాలా బాగుంది. అన్యాయాలు, అక్రమాలు ఎక్కడ చూస్తే అక్కడ కొట్టవచ్చేటట్లు కనబడే ఈ నాటి సంఘంలో ప్రతి జీవి ఎదుర్కొంటున్న చిక్కుసమస్యలను చాలా చక్కగా రచయిత చిత్రీకరించారు.

—గాదె సుబ్బారావు (బరంపురం—4)

* * *

'విధి విన్యాసాలు' చాలా బాగుంటున్నది. 'పారిజాతం' కథ బాగానే ఉంది. కాని పాత్రలు ఎక్కువ కావటం వల్ల తికమకగా ఉన్నది. ముఖ్యంగా సత్యవతి, సతీదేవి పాత్రలు వచ్చినప్పుడు కొద్దిగా వెనక్కు వెళ్లవలసి వస్తున్నది. బాపు 'కార్టూనులు' చాలా హాస్యంగా ఉంటున్నాయి. 'మాణిక్యవీణ', 'వింతలు-విడ్డూరాలు' బాగుంటున్నాయి.

—ప్రఖ్యా శరత్‌బాబు (తెనాలి)

* * *

ముఖచిత్రాలు చాలా ఆకర్షణీయంగా వేస్తున్నారు. బాపుగారి 'కార్టూన్లు ఎక్సలెంట్'గా ఉంటున్నాయి.

'వాస్తవగాథలు' శీర్షిక ఇకముందు ఉండబోదంటే ఏదో దిగులు అనిపించింది. వేసినవి డజను, రకరకాలుగా వివిధ తరగతుల విచిత్ర వ్యక్తుల వాస్తవ గాథల్ని ప్రచురించి, పాఠకులకు మంచి రిలీఫ్ ఇచ్చారు. 'కేమోమిల్లా' విశిష్టమైన కథ. శశిభూషణ్‌లాంటి పిచ్చిభయాలకు వెరవని ఉత్తమ వ్యక్తులు, అదీ డాక్టరులంటేనే కాని, నాలాయనీదేవిలాంటి మానసిక బాధ పొందే పేషెంట్స్‌కి నయం కాదు.

—తాడూరి జోగాచారి (హుస్నాబాద్)

* * *

'సరస చేసిన తప్పు' వాస్తవ గాథ చాలా బాగున్నది. మీరు ఇంతవరకు ప్రచురించిన 12 'వాస్తవ గాథలు' బాగున్నవి. కాని ఈ శీర్షికను ఇంతటితోనే ముగింపచేసినందుకు చాలా విచారిస్తున్నాము.

ఎ. నరేందర్ (ములుగు)

* * *

కమలామణిగారి 'పారిజాతం' సీరియల్ చాలా బాగున్నది.

'వాస్తవగాథలు' ఈ శీర్షిక ఇంతటితో 'సమాప్తం' అని చూడటంతోటే నాకు ప్రభ మీద చాలా కోపం వచ్చింది.

—పరిగి రమాదేవి (బెంగుళూరు—3)

* * *

మీరు ప్రచురిస్తున్న 'విజ్ఞానవీథి' శీర్షిక చాలా బాగుంది. ప్రయోజనకరమైన శీర్షికగా విలసిల్లుతున్నది. ప్రభ తెలుగు సాహిత్య వీథిలో ఒక జ్యోతిగా విరాజిల్లుటకు కారణం 'మాణిక్యవీణ'.

'కవితకోసం ప్రార్థనచెయ్యండి'—ఇది హృదయాన్ని కదిలించే గాథ. చదివి నేను ఇప్పటికి ఆ అనుభూతి నుండి తేరుకోలేక పోతున్నాను. ఈ ప్రపంచంలో చెడ్డవారు అని పేరు పడ్డం చాలా సులువు. కాని మంచివారని పేరు తెచ్చుకోవడానికి...అబ్బ! ఎంత కష్టపడాలి! బాల్కి అనుకొన్న మాటలు 'ఇంత మంచిదా ఈమె?' అని నేను అనుకొన్నాను. ఏది ఏమైనా సంఘం మారింది అనడానికి ఇదొక నిదర్శనం. ఒక తప్పు చేసినందుకు అలా జీవితాంతము తప్పులు చేస్తూ, అవినీతికరమైన జీవితం గడపకుండా, పశ్చాత్తాపపడిన వారికి కూడా సంఘంలో స్థానముంది అంటే, తప్పకుండా మనది పవిత్ర భారతదేశం, భారత నారి అనే మాట సార్థకం అవుతుంది.

—శకుంతలా వాయర్ (వైజాగ్)

* * *

'విధి విన్యాసాలు' సీరియల్ చదువుతూంటే ఏదో మధురానుభూతి పొందుతున్నట్లు ఫీలవుతున్నాము. ముఖ్యంగా ప్రసాదరావు, వాసుల కలయిక, వారి సంభాషణ హృదయాన్ని ఊయల లూగిస్తోంది.

—రామచంద్రరావు (కర్నూలు)

* * *

'ఒక్క మొక్క, ఇద్దరు తోటమాలులు' చదువుతున్నంత వరకు నన్ను నేనే మరిచిపోయానంటే నమ్మండి. అంత వాస్తవికంగా ఉన్నది. అందులోనూ 'ప్రతి ఇల్లు విశ్వవిద్యాలయమైతే, తల్లితండ్రులు ఉపాధ్యాయులు'—ఈ వాక్యంలో ప్రతి అక్షరం విలువ కలిగినది.

—కె. గోపాలరావు (చేలూరు)

* * *

'అనిత' ముఖచిత్రం చూడగానే ఎంతో సరదా వేసింది. వ్యంగ్య రచన 'లాటరీ వేదాంతం' నచ్చింది. మేముకూడా లాటరీ టిక్కెట్లు కొంటాం. రిజల్ట్సు వచ్చాక మా మొహాలు మాడిపోతాయి. ఇంక సీరియల్స్ రెండూ బాగానే ఉన్నాయి. ఈ మధ్య 'కార్టూన్స్' చాలా నవ్విస్తున్నాయి.

—వి. హరికృష్ణ (విశాఖ—4)

* * *

22—7—70 వ తేదీ ప్రభలో కథలన్నీ బాగున్నాయి. ఆదోని లలితగారు వ్రాసిన 'అంతా మామూలే' కథ ప్రారంభంలో బాగానే ఉంది. కాని ముగింపు బాగులేదు. 'ఆడవాళ్లకే అన్నీ క్షమించే విశాల హృదయం ఉంది కాని మగవాళ్లకు లేదు' అని నిరూపించడానికి వ్రాసినట్లుందీ కథ. కాని మగవారికి కూడా ఈ విశాల హృదయం ఉందని నిర్భయంగా చెప్పగలను. మగవాళ్ల

---

మొహం కడిగించింది. మళ్లీ గదిలోకి తీసుకువచ్చింది.

"నేను ఇప్పుడే వస్తాను ఉండు, విమలా!" అంటూ రాధ పోలీసువాళ్లకు ఎదురు నడిచింది.

పోలీసువాళ్లు 13 వ నంబరు రూము దగ్గర ఉండగా రాధ అక్కడకు వచ్చింది.

వార్డెన్‌ను విష్‌చేసి, "సారీ, మేడమ్" అని కథ మొదలుపెట్టింది. "మన హాస్టల్లోకి వచ్చింది మా తమ్ముడే నండీ! మా నాన్నగారు ఎందుకో కోప్పడ్డారట వాడిని. ఆమైన అలిగి చెప్పకుండా వచ్చేశాడు. రైల్లో పడి వచ్చాడు, మారు బట్టలు కూడా లేకుండా. ఇప్పుడే స్నానం చేయించి వాడి చొక్కా, నిక్కర్ ఉతికి ఆరవేయబోతున్నాను. ఇంతలోపల ఈ పోలీసు సోదా సంగతి విని ఇట్లా వచ్చాను."

వార్డెన్, పోలీసులు గమ్మున వెనక్కు వెళ్లారు. పైగా, కంప్లెయింట్ ఇచ్చిన కుమార్‌మీద మండిపడ్డారు.

సురేందర్‌కు పోలీసుల భయం తొలగిపోయేసరికి ప్రొద్దుపోయింది. దొరసాన్ల కాళ్లకు మరొక్కసారి మొక్కి హాస్టల్ వదిలి రోడ్డుమీదకు వచ్చాడు.

తను గుత్తకు తీసుకున్న పేవ్‌మెంట్ వంక దీనంగా చూచాడు.

పక్కనే ఉన్న పాన్ షాపువాలా సురేందర్‌ను చూడగానే పిలిచాడు. జాజి చెక్కల పెట్టె, పాలిష్ డబ్బాలు, బ్రష్షు, గుడ్డపీలికలు — సురేందర్ యావదాస్తినీ అప్పగించాడు.

ఈసురోమంటూ బస్సు స్టాప్‌కి వచ్చి నిలబడ్డాడు సురేందర్. వాళ్ల బస్తీకి వెళ్లే పదవ నంబరు బస్సు వచ్చి ఆగింది.

ఈ బస్సులో ఉన్న కండక్టర్ ఎవరా అని ఎగా దిగా చూచాడు సురేందర్. హమ్మయ్య! తనను అప్పుడప్పుడు టిక్కెట్టు లేకుండా తీసుకువెళ్లే కండక్టరే ఉన్నాడు. లేని బలం పుంజుకున్నాడు.

బస్సు ఎక్కాడు సురేందర్. బస్సు సగం ఖాళీగా ఉంది.

బస్సులో ఇద్దరు టెరిలిన్ పాంట్ బాబులు ఎకచెకలు, పకపకలుగా మాట్లాడుకుంటున్నారు.

"నిజంగానే పర్స్ పోయిం దనుకున్నానురా! నువ్వు జోక్ చేశా వనుకోలేదు" అన్నాడు ఒక బాబు.

"అవును. నువ్వు మళ్లీ మరెప్పుడైనా హిప్ పాకెట్‌లో పర్స్ పెట్టకుండా నీకు గుణపాఠం నేర్పాలనుకున్నాను. నువ్వు మేకప్ అయిన తరవాత మరొక్కసారి అద్దం ముందు నిలబడి చూచుకుంటున్నావే—అప్పుడు నీ పర్స్ లాగేశాను" అన్నాడు రెండవ బాబు.

కొందరికి పరిహాసం వేడుక అయితే, మరికొందరికి జీవితమే పైశాచిక పరిహాసం. విధి ఎంత విపరీతంగా ఉంటుంది! అని మీమాంసలో పడి మునిగిపోవడానికి సురేందర్ వేదాంతం నేర్చుకోలేదు. ఇది సంఘం తెచ్చిపెట్టిన దురన్యాయం అని వేదిక ఎక్కి ఉపన్యాసం దంచడానికి సురేందర్ రాజకీయ నాయకుడు కాదు.

అతనిని కన్న తండ్రే అతనిని పోషించకుండా తాగి తందనాలాడుతుంటే మిగతా వారి దయాదాక్షిణ్యాలకోసం అర్రులు చాచి ప్రయోజనం లేదని చదువు రాని సురేందర్‌కు ప్రకృతి నేర్పిన పాఠం. ఆ విజ్ఞత వల్లనే జీవిత పోరాటంలో అతను వెనుదీయక మరునాడు ఉదయం మళ్లీ ఆ పేవ్‌మెంట్ మీద కూర్చున్నాడు ధైర్యంగా. ★